
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.4 । కనిష్ఠం 25.8

5
కామారెడ్డి
జిల్లా వార్తలు
గురువారం 22 మే 2025

114 మూత్రశాలలు నిర్మించేందుకు నిధుల మంజూరు

కామారెడ్డి టౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 83 ప్రభుత్వ, జిల్లా పరిషత్, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో బాలికల కోసం 114 మూత్రశాలలు నిర్మించేందుకు నిధులు మంజూరైనట్లు డీఈవో రాజు తెలిపారు. కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ప్రత్యేక చొరవతో ఎన్ఆర్ఈజీఎస్ కింద యుద్ధ ప్రాతిపాదికన రూ.228 లక్షల అడ్మినిస్ట్రేషన్ సాంక్షన్ నిధులు మంజూరు చేశారని తెలిపారు. వీటి నిర్మాణం త్వరలో చేపట్టనున్నట్లు డీఈవో తెలిపారు.



వానాకాలం పంట ఖరారు

- 5.30 లక్షల ఎకరాల్లో సాగు ప్రణాళిక ఖరారు చేసిన వ్యవసాయశాఖ
- సాగులో వరి, మొక్కజొన్న, సోయా, పత్తి పంటలే ఎక్కువ
- వరి 3.15 లక్షల ఎకరాల్లో సాగు
- సోయాబీన్ 84,220, మొక్కజొన్న 52,016 ఎకరాలు
- పత్తి 73,545 ఎకరాల్లో సాగయ్యే అవకాశం
- విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచనున్న వ్యవసాయశాఖ
- 1.30 క్వింటాళ్లలో విత్తనాలు..
  1.46 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం
- జిల్లాలో ఇప్పటికే జీలుగ విత్తనాల పంపిణీ

కామారెడ్డి, మే 21(ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటల ప్రణాళిక ఖరారైంది. జిల్లాలో 2025-26 వానాకాలానికి సంబంధించిన పంటల అంచనా సాగు విస్తీర్ణం అవసరమయ్యే విత్తనాలు, ఎరువుల ప్రణాళికను వ్యవసాయశాఖాధికారులు సిద్ధం చేశారు. జిల్లాలో నేల స్వభావం బట్టి ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో సాగయ్యే అవకాశం ఉందనే దాన్ని బట్టి మండలాల వారీగా ప్లానింగ్ తయారు చేశారు. జూన్‌లో వానాకాలం సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో యాక్షన్ ప్లాన్‌ను రూపొందించారు. అన్ని రకాల పంటలు కలిపి జిల్లా వ్యాప్తంగా సుమారు 5 లక్షల ఎకరాలల్లో సాగవుతాయనే అంచనా వేస్తున్నారు. కాగా ఈ సీజన్ నుంచి వానాకాలం, యాసంగి సీజన్‌లను ముందుకు జరపాలని వ్యవసాయశాఖ భావిస్తోంది. ప్రతీ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో వడగండ్ల, అకాల వర్షాలు కురిసి పంటలకు పెద్ద మొత్తంలో నష్టం జరుగుతోంది. ఈ క్రమంలో ముందస్తుగా నాట్లు వేయించి, ముందస్తుగా కోతలు కోయించేలా అధికారులు కృషి చేస్తున్నారు. ఈ సీజన్ నుంచి నిర్ణయాన్ని అమలు చేసేలా ముందుకెళ్తున్నారు.

5.36 లక్షల ఎకరాల్లో పంటల సాగు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్ పరిధిలో వానాకాలం పంటల సాగుకు సంబంధించిన ప్రణాళికను వ్యవసాయశాఖ రూపొందించింది. గత సీజన్‌తో పోలిస్తే ఈ వానాకాలంలో కాస్తా సాగు విస్తీర్ణం పెరగనుంది. గడిచిన వానాకాలం సీజన్‌లో 5.16 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు కాగా ఈ సీజన్‌లో 5.36 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా వేశారు. ఈ లెక్కన ఈ సీజన్‌లో పంట సాగు విస్తీర్ణం కాస్త పెరగనుంది. దీంతో వరి 3,18,342 ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేయగా, మొక్కజొన్న 52,016 ఎకరాలు, పత్తి 34,459, సోయాబీన్ 84,220, కందులు 21,300, పెసర్లు 4,347, మినుములు 2,993, చెరుకు 4,100, జొన్నలు 300 ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా వేశారు.

1.30 క్వింటాళ్లలో విత్తనాలు.. 1.46 మెట్రిక్ టన్నుల్లో ఎరువులు అవసరం

ఈ వానాకాలం సీజన్‌లో సాగయ్యే పంటలకు అనుగుణంగా విత్తనాలను సైతం అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేసి ప్రణాళికను రూపొందించారు. 95,503 క్వింటాళ్లలో వరి, 25,266 క్వింటాళ్లలో సోయాబీన్, 345 పత్తి ప్యాకెట్లు, మొక్కజొన్న 4,161 క్వింటాళ్లలో, కందులు 852 క్వింటాళ్లలో, పెసర 348 క్వింటాళ్లలో, మినుములు 239 క్వింటాళ్లలో విత్తనాలు అవసరం కానున్నాయి. అయితే ఈ విత్తనాలకు ప్రభుత్వం ఎలాంటి సబ్సిడీని ఇవ్వడం లేదు. వీటితో పాటు సబ్సిడీపై 10,700 క్వింటాళ్లలో, జనుము, జీలుగు విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేయనుంది. జిల్లాలో ఇప్పటికే జీలుగు విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తున్నారు. 1.46 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కానున్నాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. వీటిలో 68,654 మెట్రిక్ టన్నులలో యూరియా, 44,762 మెట్రిక్ టన్నులలో కాంప్లెక్స్, 18,222 మెట్రిక్ టన్నులలో డీఏపీ, 16,926 మెట్రిక్ టన్నులలో ఎంఓపీ ఎరువులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. ఇందులో ఇప్పటికే యూరియా 8,122 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని కాంప్లెక్స్ 4,969 మెట్రిక్ టన్నులు, డీఏపీ 1,767 మెట్రిక్ టన్నులలో, ఎన్ఓపీ 260 మెట్రిక్ టన్నుల స్టాక్ అందుబాటులో ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

రైతులకు అవగాహన

యాసంగి సీజన్‌లో వడగండ్ల వల్ల కలిగే నష్టాన్ని తప్పించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం సీజన్‌లను ముందుకు జరపాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలను సైతం జారీ చేసింది. దీంతో గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులు, విస్తరణ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సాధారణంగా ఏటా వానాకాలం సీజన్‌లో వరి నాట్లు జూలైలో ప్రారంభించి సెప్టెంబరు వరకు వేస్తారు. దీంతో వానాకాలం కోతలు ఆలస్యమై యాసంగిపై ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలో యాసంగి కోతలు మే నెల వరకు జరుగుతున్నాయి. దీంతో మార్చి, ఏప్రిల్ నెలలో సరిగా వరి పంట పొట్ట దశలో ఉన్న సమయంలో వడగండ్లు పడి తీవ్ర నష్టం జరుగుతోంది. దీనిని అధిగమించేందుకు ముందస్తుగా నాట్లు వేయించాలని అధికారులు భావిస్తున్నారు. జూన్ 15లోగా నారు పోసుకొని జూలై 15లోగా నాట్లు పూర్తి చేసేలా చూస్తున్నారు. అలాగే యాసంగిలోనూ నవంబరు 15లోగా నారు పోసుకుని డిసెంబరు 15 లోగా నాట్లు వేసేలా ప్రయత్నిస్తున్నారు.

అనుకూల రకాలపై కసరత్తు

సీజన్‌లో ముందుగా ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లాలో నెలల స్వభావాన్ని బట్టి అవసరమయ్యే కొత్త రకాలను తెప్పించే పనిలో అధికారులు ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సీజన్‌ను ముందుగా ప్రారంభిస్తున్నందున ఏ జిల్లా పరిస్థితులకు అనుగుణంగా ఏయే రకాలు అవసరమవుతాయనే దానిపై రాష్ట్రస్థాయిలో కసరత్తు జరుగుతోంది. దీంతో కామారెడ్డి జిల్లాకు సంబంధించి ఏయే రకాలు సాగుకు అనుకూలంగా ఉన్నయే ఆ వంగడాలనే రైతులు సాగు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. యాసంగి సీజన్‌లోనూ నవంబరులో నారు పోసుకోవడం వల్ల చలి తీవ్రత కారణంగా నారు ఎదగదని రైతులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఏ రకాలైతే అనుకూలంగా ఉంటాయో వాటినే అందుబాటులో ఉంచాలని అధికారులు భావిస్తున్నారు.



లింగంపేటలో ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

పేదల సొంతింటి కల కలగానే మిగిలింది

- నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్

లింగంపేట, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డి నియోజకవర్గంలో గత ఇరవైపేళ్లుగా పేదల సొంతింటి కల కలగానే మిగిలిపోయిందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. ఆయన బుధవారం లింగంపేట మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసి మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాల్లో అసమర్థ నాయకుల వల్ల ఏ ఒక్క గ్రామంలోనూ డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించలేదని ఆయన అన్నారు. ఆనాటి ప్రభుత్వంలో ఉన్న అసమర్థ నాయకుల కారణంగా పేదలకు సొంతింటి కల దూరమైందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 15 నెలల్లో 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని ఆయన తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదికలో విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మృతుల కుటుంబాలకు చెక్కులను అందజేశారు. విద్యుదాఘాతంతో మృతి చెందిన వారికి ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున వారి కుటుంబాలకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, ఎంపీడీవో నరేష్, నాయకులు జొన్నల రాజు, రఫీఖ్, ప్రసాద్‌గౌడ్‌లతో పాటు నాయకులు ఉన్నారు.



భిక్కనూరు టోల్ ప్లాజా వాహనాలను నిలిపి ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద గ్రామస్థుల ఆందోళన

భిక్కనూరు, మే 21(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు టోల్‌ప్లాజాలో తమ వాహనాలకు టోల్ వసూళ్ల చేస్తున్నారని బుధవారం గ్రామస్థులు ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ లోకల్ అని చెప్పినా పట్టించుకోవడం లేదని ఆధార్‌కార్డులు అడుగుతున్నారని మండలంలోని తిప్పాపూర్ వాహనదారులు వివరించారు. ఎన్నిసార్లు చెప్పినా టోల్ యాజమాన్యంలో మార్పు రావడం లేదని ఆరోపించారు. లోకల్ వాహనాలకు టోల్ వసూలు చేయమని చెప్పి వసూళ్ల చేయడం ఏమిటని ప్రశ్నించారు. మరోసారి ఇలాంటిది జరిగితే సహించేదిలేదని అన్నారు. దాదాపు అరగంట పాటు ఆందోళన చేయడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. మరోసారి టోల్ వసూలు చేస్తే పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించి ఆందోళనను విరమించారు.

బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి

కామారెడ్డి టౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పున్న రాజేశ్వర్, జిల్లా అధ్యక్షుడు గజ్జల భిక్షపతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక సంస్థలు, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలతో పాటు విద్యారంగంలో జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని అన్నారు. రిజర్వేషన్లు అమలు చేస్తే 106 బీసీ కులాలకు న్యాయం జరుగుతుందని తద్వారా విద్య, రాజకీయ రంగంలో బీసీలు రాణిస్తారని తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారించాలి

కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారించడంతో పాటు ఆయా గ్రామాలకు అవసరమైన ఇసుక లభ్యతపై దృష్టి సారించాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హస్గుల్, కుర్లా గ్రామాలకు స్థానిక అవసరాలకు సంబంధించి ఇసుక లభ్యత, పర్యావరణ అనుమతులు, మట్టికి సంబంధించి కనీస పరిమాణంలో స్థానిక అవసరాలకు తహసీల్దార్‌లకు అనుమతి ఇచ్చి సులభమైన పద్ధతి, ఇసుక రవాణా నియంత్రించడంలో చెక్‌పోస్టు పెట్టేందుకు కావాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఏఎస్పీ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేటలో రెండో విడత 392 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు



ధర్మారెడ్డిలో ముగ్గు వేసిన ఎంపీడీవో ప్రభాకర్ చారి

నాగిరెడ్డిపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట మండలంలో రెండో విడత 392 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు ఎంపీడీవో ప్రభాకర్ చారి తెలిపారు. మండలంలోని అచ్చయపల్లి గ్రామ పంచాయతీని మోడల్ గ్రామ పంచాయతీగా ఎంపిక చేసి జనవరి 26న అచ్చయపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో 90 ఇందిరమ్మ ఇళ్లను మంజూరైనట్లు తెలిపారు. ప్రస్తుతం మండలంలోని మిగతా 26 గ్రామ పంచాయతీల్లో రెండో విడతలో 392 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. ప్రస్తుతం మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల వారీగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను వెంటనే లబ్ధిదారులు చేపట్టే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల ఇంటి నిర్మాణం కోసం వివిధ గ్రామాల్లో ముగ్గులు వేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం గురించి వారికి అవగాహన కల్పిస్తున్నట్టు, తమ ఇండ్ల నిర్మాణాలను వెంటనే చేపట్టి త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని లబ్ధిదారులను కోరుతున్నట్టు ఆయన తెలిపారు. బుధవారం ధర్మారెడ్డి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు వేసి నట్టు ఆయన తెలిపారు. ఎంపీడీవో వెంట పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులున్నారు.



భిక్కనూరులో మాట్లాడుతున్న డీఈవో రాజు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలి

- డీఈవో రాజు

భిక్కనూరు, మే 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని డీఈవో రాజు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని డీఈవో సందర్శించి మాట్లాడారు. ఉపాధ్యాయులు శిక్షణ తరగతుల్లో భాగంగా సమర్థతను పెంపొందించుకుని విద్యార్థులకు తరగతి గదిలో వారికి అర్థమయ్యే విధంగా బోధించాలన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, పదవ తరగతిలో ఉత్తీర్ణత శాతం, తదితర అంశాలను క్లుప్తంగా తల్లిదండ్రులకు అర్థమయ్యే విధంగా వివరించి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజ్‌గంగారెడ్డి, ఎంఈవో వేణుగోపాల్ శర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చల్లబడ్డ వాతావరణం

- జిల్లాలో ఉదయం నుంచి రాత్రి వరకు కురిసిన వర్షం



మహమ్మద్‌నగర్‌లో కురుస్తున్న వర్షం

కామారెడ్డి టౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): గత మూడు నెలలుగా అధిక ఎండలు, వేడితో సతమతమవుతున్న ప్రజలకు వాతావరణం చల్లబడడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ ఏడాది వానాకాలం ముందస్తుగా ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించడంతో కొందరు రైతులు ఆనందం వ్యక్తం చేస్తుండగా యాసంగి ధాన్యం కుప్పలుగా పోసి అమ్మకాలు జరగని రైతులు మాత్రం ఇబ్బందులు పడుతున్నారు. చేతికి వచ్చిన పంట నీటి పాలవుతుందేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో పలు చోట్ల వర్షం

జిల్లాలోని బుధవారం తెల్లవారు జాము నుంచి రాత్రి వరకు ఆయా మండలాల్లోని గ్రామాల్లో వర్షం కురిసింది. కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు మహమ్మద్‌నగర్, బాన్సువాడ, దోమకొండ, భిక్కనూర్, నాగిరెడ్డిపేట, లింగంపేట, బీబీపేట సదాశివనగర్ మండలంలోని సదాశివనగర్, కుప్రియాల్, ధర్మారావ్‌పేట్, అమర్లబండ, మోడెగాం తదితర మండలాల్లో వర్షం కురిసింది.

ప్రతీ ఏటా మే నెలలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుండగా ఈ సంవత్సరం జిల్లాలో ఏప్రిల్ మొదటి వారం నుంచి ఎండల తీవ్రత బాగా పెరిగిపోయింది. దాదాపు 45 డిగ్రీల వరకు ఎండలు కాచాయి. ఉదయం 10 దాటిందంటే ఇళ్ల నుంచి బయటకు రావడానికి ప్రజలు జంకే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎండ తీవ్రతతో కొందరికి డీహైడ్రేషన్ ఏర్పడి ఆసుపత్రిలో చికిత్స పొందిన సందర్భాలు ఉన్నాయి. తాగునీటికి సైతం ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ప్రస్తుతం వారం రోజుల నుంచి వాతావరణం కొద్దిమేర చల్లబడడంతో ప్రజలకు ఉపశమనం లభించినట్లయింది.

కొందరు రైతుల్లో సంతోషం.. మరికొందరికి ఇబ్బందులు

జిల్లాలోని వరి కోతలు పూర్తయి ధాన్యం అమ్మకాలు జరిగిన రైతులు వర్షాలు పడుతుండడంతో సంతోషం వ్యక్తం చేస్తుంటే ఇంకా వరి కొనుగోలు కానీ రైతుల్లో మాత్రం ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం మే చివరి వారం కల్లా నైరుతి రుతు పవనాలతో వర్షాలు బాగా కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతుండడంతో రైతులు వానాకాలం పంట సాగుకు సిద్ధం అవుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు సైతం వానాకాలం పంట అంచనాలపై నిమగ్నమవడంతో పాటు రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ఇక ధాన్యం కొనుగోలు కానీ రైతులు మాత్రం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కామారెడ్డి నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల్లో వరి కొనుగోలు పూర్తికాకపోవడంతో రైతులు పండించిన పంట నీటి పాలవుతుందేమోనని ఆవేదన చెందుతున్నారు. అధికారులు త్వరగా పంట కొనుగోలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



గాంధీగంజ్‌లో తడిసిన ధాన్యాన్ని సేకరిస్తున్న మహిళా రైతు



భిక్కనూరులో కురుస్తున్న వర్షం



ఐలాపూర్‌లో..



బీబీపేటలో..

బోధన్ పట్టణంలో రూ.30కోట్లతో ఇందిరమ్మ ఇళ్లు


ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న సుదర్శన్‌రెడ్డి

● అర్హులైన లబ్ధిదారులందరికీ ఇళ్ల మంజూరు: బోధన్ ఎమ్మెల్యే

బోధన్‌రూరల్,మే21(ఆంధ్రజ్యోతి): బోధన్ నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని బోధన్ పట్టణంలోనే 600ఇందిరమ్మ ఇళ్లు మొదటి విడతలో మంజూరయ్యాయని 30కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభమయ్యాయన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్దిదారులు నిర్మాణాలను వేగవంతం చేయాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మహిళలు అవసరమైతే డ్వాక్రా సంఘాలలో డబ్బులు తీసుకోవాలన్నారు. తీసుకున్న డబ్బులు సకాలంలో తిరిగి చెల్లించాలన్నారు. గత ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో పేద ప్రజలకు బోధన్‌లో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ప్రజల సంక్షేమం కోసం ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఇంటి నిర్మాణానికి 5లక్షల రూపాయలు విడతల వారిగా అందుతాయన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలకు వెళ్లవద్దని, దళారులను ఆశ్రయించవద్దన్నారు. పట్టణంలోని పాన్‌గల్లీ, రాకాసిపేట్, శక్కర్‌నగర్ తదితర అన్ని వార్డులలో బుధవారం ఆయన పర్యటించి ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, గ్రంథాయల సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, పట్టణ అధ్యక్షులు పాషా మోయినోద్దీన్, కౌన్సిలర్లు దాము, శరత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ మున్సిపల్ డీఈ, హౌసింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● షాదీముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

బోధన్ పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో బుధవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి షాదీముబారక్, కల్యాణ లక్ష్మి లబ్దిదారులకు చెక్కుల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపడుచుల పెళ్లిళ్లకు లక్ష రూపాయలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. 120లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, గ్రంథాయల సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్‌రెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, పట్టణ అధ్యక్షులు పాషా మోయినోద్దీన్, కౌన్సిలర్లు దాము, శరత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ మున్సిపల్ డీఈ, తహిల్దార్ విఠల్, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

● వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం బోధన్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌తో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీలను ఎప్పటికప్పుడు తీయించి వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అనంతరం మున్సిపాలిటికి వచ్చే ఆదాయంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మున్సిపాలిటీ ఆదాయ సమీకరణకు చర్యలు చేపడుతున్నామని పట్టణ అభివృద్ధికి పన్నులు చెల్లించి ప్రతి ఒక్కరు. ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, డీఈ యోగేష్, ఏఈ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


ఎడపల్లిలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

● అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఎడపల్లి: ఎడపల్లి మండలంలో విధులు నిర్వహి స్తున్న మండల స్థాయి అధికారులు మండల ప్రజలకు అందుబాటులో ఉండాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయాన్ని బుధవారం ఎమ్మెల్యే సు దర్శన్‌రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ హాజ రు పట్టికను పరిశీలించారు. మండలంలో విధులు నిర్వహిస్తున్న పంచా యతీ రాజ్ ఏఈ, మండల అభివృద్ధి అధికారి గురించి ఆరా తీశారు. అనంతరం అలీసాగర్ ఎత్తిపోతల వద్ద బ్రిడ్జిపై వర్షం నీరు నిలిచి ఉందని ఆ నీటిని రోడ్డు ప్రక్కన కాలువ తీసి నీరు కాలువలోకి వెళ్లేవిధంగా చూ డాలని ఉపాధిహామీ ఏపీఓ శ్రీవాణికి సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో విధులు నిర్వహిస్తున్న అధికారులు ఎల్లప్పుడూ మండల ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, పీసీసీ డెలిగేట్ గంగా శంకర్, పార్టీ మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బిల్లా రాంమోహన్, పార్టీ నాయకులు శంకర్ నాయు డు, బొబ్బిలి శ్రీనివాస్, సత్యనారాయణ, అధికారులు తదితరులు ఉన్నారు.

ఫకీరాబాద్‌లో గోశాల ప్రారంభం


ఫకీరాబాద్‌లో గోశాలను ప్రారంభిస్తున్న బీజేపీనాయకులు

నవీపేట,మే21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్‌లో గురువారం హరే రామ గోశాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, వీ.మోహన్ రెడ్డిలు ప్రారంభించారు. గో సేవ సమితి ఆధ్వర్యంలో గోశాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నగేష్ స్వామి, సరిన్, వంశీమోహన్, శ్రీనివాస్ గౌడ్, ఆనంద్, శ్రీకాంత్, సందీప్, రాహుల్, సతీష్, రాజేందర్ గౌడ్, రాధ తదితరులు పాల్గొన్నారు.

వార్డులలోని సమస్యలను పరిష్కరించాలి

బోధన్‌రూరల్,మే21(ఆంధ్రజ్యోతి): వార్డులలోని సమస్యలను పరిష్కరించాలని పాన్‌గల్లీలో పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి బీజేపీ నాయకులు కందికట్ల శ్రీనివాస్ వినతిపత్రం అందించారు. వెంటనే ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్‌కు వార్డులలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యేకు బీజేపీ నాయకులు, కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేత్రదానం మరొకరికి చూపును అందిస్తుంది

బోధన్‌రూరల్,మే21(ఆంధ్రజ్యోతి): కళ్లదానం మరొకరికి చూపును అందిస్తుందని లయన్స్ క్లబ్ ప్రతినిధులు బసవేశ్వర్ రావు అన్నారు. బుధవారం బోధన్‌కు చెందిన రమేష్(59)అనే వ్యక్తి బుధవారం తెల్లవారుజామున మృతి చెందగా అతని కుటుంబ సభ్యులు అతని కళ్లను దానం చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్లదానం మరొకరికి చూపును అందిస్తుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

హబీబ్‌నగర్‌లో వ్యక్తిపై చాకుతో దాడి

నిజామాబాద్ అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి):నగరంలోని 1వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తిపై చాకుతో దాడి చేసిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. షేక్ షహబాత్, అతని తమ్ముడు షేక్ అబ్రార్‌లు హబీబ్‌నగర్‌లో కిరాణాషాపు వద్ద నిలబడి ఉండగా కొంతమంది వెక్కిరించుకుంటూ వెళ్లగా ఎవరు మీరు అని అడడగా ఆ విషయాన్ని మనస్సులో పెట్టుకొని రాత్రి 9.30 సమయంలో హర్షత్ అనే వ్యక్తి చాకుతో షహబాత్‌ను పొడవగా తీవ్ర రక్తస్రావం అయినట్లు 1వ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. గాయపడిన షహబాత్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఏర్గట్లలో విగ్రహ ప్రతిష్ఠాపన


ఎమ్మెల్యేకు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

ఏర్గట్ల,మే 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివ పంచాయన సహిత హనుమాన్ దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా బుధవారం బాల్కొండ ఎమ్మెల్యే మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్‌లు హాజరై ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం నిర్వాహకులు ప్రముఖులను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కాగా గురువారం ఆలయం వద్ద అన్నదానం నిర్వహి స్తున్న ట్లు నిర్వాహకులు తెలిపారు. ఇట్టి కార్యాక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని స్వామి వారి కృపకు పాత్రులు కావాల ని కోరారు. ఈ కార్యక్ర మంలో బద్ధం వారి సంఘసభ్యులు,మాలాధారణ స్వాములు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న నాయబ్ తహసీల్దార్‌కు సన్మానం

నవీపేట,మే21(ఆంధ్రజ్యోతి): నవీపేట మండల రెవెన్యూ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్‌గా పని చేసిన తెలంగ్‌రావు నిర్మల్ జిల్లాకు బదిలీ అయ్యారు. బుధవారం మండల రెవెన్యూ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న నాయబ్ తహసీల్దార్ తెలంగ్ రావును తహసీల్దార్ వెంకట రమణతో పాటు కార్యాలయ సిబ్బంది, పలువురు ఉద్యోగులు శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. 15నెలల క్రితం జరిగిన క్రితం ఎన్నికల సమయంలో నిర్మల్ జిల్లా నుండి తెలంగ్ రావు నవీపేటకు బదిలీపై వచ్చారు. ఇదిలా ఉండగా నవీపేట నూతన నాయబ్ తహసీల్దార్‌గా నిర్మల్ జిల్లా నుండి రంజిత్ బదిలీపై రానున్నారు.

నాళేశ్వర్‌లో చెట్టుపై పడిన పిడుగు


పిడుగుపాటుకు గురైన చెట్టు

నవీపేట,మే21(ఆంధ్రజ్యోతి):మండలంలోని నాళేశ్వర్‌లో మంగళవారం రాత్రి చెట్టుపైన పిడుగు పడింది. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కనే ఉన్న చెట్టుపైన పిడుగు పడడంతో దాని కాండం కొంత భాగం దెబ్బతింది. ఈ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇదిలా ఉండగా బుధవారం మండలంలో 17.6 మిల్లీ మీటర్ల వర్షపాతం కురిసినట్లు నమోదైందని అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


బైకు ఢీ కొట్టిన కారు దృశ్యం

ఎడపల్లి, మే21(ఆంధ్రజ్యోతి):ఎడపల్లి మండల కేంద్రంలోని బోధన్-నిజామాబాద్ ప్రధాన రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మరణించినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని శివాలయం వద్ద బోధన్-నిజామాబాద్ ప్రధాన రహదారిపై బైకుపై వస్తున్న నిమ్మగడ్డ రమేష్(60) అనే వ్యక్తి సరయు ఫంక్షన్ హాలువైపు యూటర్న్ తీసుకోవడంతో నిజామాబాద్ నుండి బోధన్ వైపు వెళుతున్న కారు ఢీ కొట్టడంతో రమేష్ తలకు తీవ్ర గాయాలు అయ్యాయని, గాయాలైన వ్యక్తిని అంబులెన్స్‌లో బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారని తెలిపారు. మృతుని భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని కారు నడిపిన వ్యక్తి రాజేష్‌పై కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వాహనదారులు సరైన ధ్రువపత్రాలను కలిగి ఉండాలి : ఏసీపీ

● నాలుగు ఆటోలు, 80ద్విచక్ర వాహనాల స్వాధీనం
● సాటాపూర్‌లో కార్డన్ సెర్చ్


సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

రెంజల్,మే21(ఆంధ్రజ్యోతి): వాహనదారులు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని సాటాపూర్ గ్రామంలో కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసులు భారీగా మోహరించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా వాహనాలను తనిఖీ చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. వాహనాలు తనిఖీ నిర్వహించిన ఒక ఇంట్లో 45మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఆయన అన్నారు. సాటాపూర్‌లో చేపట్టిన కార్డెన్ సెర్చ్‌లో నలుగురు సీఐలు, పది మంది ఎస్‌ఐలు, 80మంది సిబ్బందిచేత సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు కమ్యూనిటి కాంట్రాక్ట్ ప్రోగ్రాం చేపట్టడం జరిగిందని ఏసీపీ తెలిపారు. ప్రతి ఒక్కరు తమకు సంబంధించిన వాహనాలకు సరైన ధ్రువపత్రాలతో పాటు ఆర్‌సీ, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలని లేని యెడల చట్టరీత్యా చర్యలు చేపడతామని అన్నారు. ఎవరైనా అనుమానంగా తిరిగితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని, ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన వ్యక్తులను అనుమానస్పదంగా ఉండే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రతి ఇంట్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామంలో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. చిన్న పిల్లలకు వాహనాలను ఇవ్వవద్దని ఏదైనా ప్రమాదం సంభవిస్తే తల్లిదండ్రులపైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ విజయ్ బాబు, వెంకట నారాయణ, శ్రీకృష్ణ, రెంజల్ ఎస్సై చంద్రమోహన్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల భారీ వర్షం


తాడ్‌బిలోలిలో జలమయమైన రోడ్లు

వేల్పూర్, మే 21(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. భారీవర్షాలతో రాకపోకలకు అంతరాయం కలిగింది. రోడ్లపై ఉన్న ధాన్యంకుప్పలు తడిసి ముద్దయ్యాయి. మంగళవారం రాత్రి కూడా ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది.

భీమ్‌గల్‌రూరల్: భీమ్‌గల్ మండలంలోని వివిధ గ్రామాలలో బుధవారం తెల్లవారు జామున భారీవర్షం కురిసింది. 40 మిల్లీ లీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్ తెలిపారు. కురిసిన వర్షానికి ఎలాంటి ఆస్తినష్టం, ప్రాణనష్టం జరుగలేదని, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండవద్దని ప్రజలను కోరారు.

ఆర్మూర్ టౌన్: ఆర్మూర్ పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో బుధవారం భారీ వర్షం కురిసింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో కల్లాలో ధాన్యంబస్తాలు తడిసిపోయాయి. పట్టణంలో కురిసిన వర్షాలకు పలు కాలనీలలో వర్షపునీరు రోడ్డుపై నిలిచాయి. 35వ వార్డులో చెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పట్టణంలోని దోబిఘాట్, పిప్రి రోడ్డు డిగ్రీ కాలేజీ మైదానంలో ఉన్న వరిధాన్యం బస్తాలు పూర్తిగా తడిసిపోయాయి. ధాన్యం కుప్పలు వేసి తాటిపత్రాలు కప్పినప్పటికి వీచిన ఈదురు గాలులకు తాటిపత్రాలు కొట్టుకుపోయి ధాన్యం పూర్తిగా తడిసిందన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ కొనుగోలు కేంద్రాలను పరిశీలించి ధాన్యం కొనుగోలును వేగవంతం చేసి బస్తాలను వెంటవెంటనే తరలించాలని ఆదేశించిన రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

రెంజల్: మండలంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పలు గ్రామాలలో రోడ్లు జలమయమయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో పలు గ్రామాలలో రాకపోకలు స్తంభించిపోయాయి. మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో గాంధీ విగ్రహం నుండి హనుమాన్ మందిరం వైపు వెళ్లే దారి పూర్తిగా జలమయమైంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. బుధవారం కురిసిన వర్షానికి అక్కడక్కడ చెట్లు నేలకొరిగాయి. తొలకరి జల్లు కురియడంతో వాతావరణం చల్లబడడంతో రైతులు పంటల సాగు చేసేందుకు అనువుగా ఉండడంతో సంతోషం వ్యక్తం చేశారు.

కోటగిరి: కోటగిరి, పొతంగల్ మండలాల్లో బుధవారం రాత్రి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. కోటగిరి మండలంలో 31.8మిల్లి మీటర్ల వర్షపాతం నమోదు కాగా పొతంగల్ మండలంలో 17.6మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. పలు చోట్ల చెట్లు విరిగిపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పంది.

దేశానికి దశ దిశ నిర్ధేశించిన నాయకుడు రాజీవ్ గాంధీ


కోటగిరిలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు


రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మానాల మోహన్‌రెడ్డి

కోటగిరి,మే21(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలో దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి వేడుకలను బుధవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్‌హన్మంతు, నాయకులు కొట్టం మనోహర్, షహీద్, భూమయ్య, అబ్బయ్య, ఆటో సాయిలు, తయ్యబ్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: భారతదేశానికి దశా దిశా నిర్దేశించిన మహానాయకుడు స్వర్గీయ ప్రధాని రాజీవ్ గాంధీ అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి అన్నారు దివంగత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా బుధవారం కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద గల ఆయన విగ్రహానికి పూ మాలలు వేసి ఘ నంగా నివాలులర్పించారు. మహనీయుడికి దేశప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఎప్పటికి రుణపడి ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, సుంకెట రవి, కాంగ్రెస్ నాయకులు బుచ్చిమల్లయ్య, సల్లూరి గణేష్ గౌడ్, నిమ్మరాజేంద్ర ప్రసాద్, అజ్మత్‌హుస్సేన్ సింగిరెడ్డి శేఖర్, సుంకెట శ్రీనివాస్, వేములవాడ జగదీశ్, అజారొద్దీన్ దూలేర్ కిషన్ గౌడ్, సాయి పాల్గొన్నారు.

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీజిల్లా అధ్యక్షుడు మానాలమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రాజీవ్ గాంధీవర్ధంతి నిర్వహించారు.ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు స్వామి, నర్సయ్య,రమేష్,అనంత్‌రావు,శ్రీనివాస్,సురేష్,నాగేంద్ర,మహేష్ పాల్గొన్నారు.

నిజామాబాద్‌అర్బన్: మాజీ ప్రధాన మంత్రిరాజీవ్‌గాంధీ 34వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా బుధవారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార బ్యాంకు అధ్యక్షుడు కుంట రమేష్‌రెడ్డి రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి సాంకేతికత పరిచయం చేశారని అన్నారు. గ్రామీణ విద్యాభివృద్ధి ప్రోత్సహించారని తెలిపారు.ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్‌అధ్యక్షుడు మానాలమోహన్‌రెడ్డి,కాంగ్రెస్‌నాయకులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచాలి


రాంపూర్‌లో ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

కోటగిరి,మే21(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో రైతులకు సరిపడ ఎరువులు అందుబాటులో ఉంచాలని కోటగిరి తహసీల్దార్ గంగాధర్ సూచించారు. కోటగిరి మండలంలోని కొత్తపల్లి సహకార సంఘం పరిధిలో గల కొత్తపల్లి, రాంపూర్ గోదాముల్లో ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఖరీఫ్‌లో రైతులకు యూరియా, డీఏపీ, పొటాష్, కాంప్లెక్స్ ఎరువులు సరిపడ అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని, నిబంధనలు పాటించాలని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట వ్యవసాయ అధికారి రాజు, విండో కార్యదర్శి కమలేష్ తదితరులున్నారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి


మృతిచెందిన పూజ

ఆర్మూర్ టౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని వడ్డెర కాలనీ లో మక్కల పూజ అలియాస్ మమత(24) అనే మహిళ అనుమానా స్పదంగా మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ గ్రామానికి చెందిన పూజ ఆర్మూర్ పట్టణానికి చెందిన సాయితో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఐదేండ్ల కూతురు, రెండు నెలల కుమారుడు ఉన్నాడు. గత కొన్నేళ్లుగా సాయి విదేశాలకు వెళ్లివస్తున్నాడు. ఇటీవల ఇంటికి వచ్చిన సాయి నెల రోజుల క్రితం విదేశాలకు వెళ్లాడు. అప్పటి నుంచి అత్త నర్సవ్వ, ఆడబిడ్డ శైలజతో గొడవలు జరుగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం సాయంత్రం రాత్రి గొడవ జరుగగా అత్త ఆడబిడ్డ కలిసి పూజపై దాడిచేశారు. బుధవారం ఉదయం పూజ గదిలో నుండి బయటకు రాకపోవడంతో కూతురు, అత్తనర్సవ్వ స్థానికుల సాయంతో తలు పులు పగులగొట్టి పూజను ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పూజ మృతికి అత్తింటివారే కారణమని వారిపై పూజ బంధువులు దాడికి యత్నించగా సంఘటన స్థలానికి చేరిన పోలీసులు నచ్చజెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

ఉద్యోగుల హక్కుల సాధనకు కృషి చేస్తాం



మాట్లాడుతున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు

ఆర్మూర్ రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి హక్కుల సాధనకు కృషి చేస్తామని ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎస్‌జీవో జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్‌కుమార్, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ అన్నారు. బుధవారం ఆర్మూర్‌లోని యూనిట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగుల సమస్యలపై నిరంతరం స్పందిస్తు ఉద్యోగులు పెండింగ్ సమస్యలపై ఉద్యమ కార్యచరణ ఇదివరకే ప్రకటించినప్పటికి దయాది దేశాలమధ్య ఏర్పడ్డ పరిస్థితుల కారణంగా మార్పులు జరుగుతున్నాయన్నారు. ఏ శాఖలోనైనా సమస్యలు ఉంటే తమదృష్టికి తీసుకురావాలని మనమందరం సంఘటితమై ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు శశికాంత్‌రెడ్డి, విశాల్, పోల శ్రీనివాస్, అతిక్, జాఫర్ హుసెన్, దినేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇనాయత్‌నగర్‌లో యువకుడి బలవన్మరణం


మృతి చెందిన జక్కుల రాజ్‌కుమార్

కమ్మర్‌పల్లి, మే 21: (ఆంధ్రజ్యోతి) పెళ్లి సంబంధాలు కుదరడంలేని మనస్తాపానికి గురైన మండలంలోని ఇనాయత్ నగర్ గ్రామానికి చెందిన జక్కుల రాజ్‌కుమార్ (23) అనే యువకుడు బలవన్మరణాకి పాల్పడినట్లు కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్ర తన ఇంట్లో ఎవరు లేని సమయంలో పొలాలలో చల్లే గడ్డి మందు సేవించగా ఇరుగు పొరుగువారు గమనించి ఆయనను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందు తూ.. బుధవారం ఉదయం మరణించినట్లు తెలిపారు. తండ్రి రాజన్న ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


బహుమతులు అందుకుంటున్న దృశ్యం

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలో ఛాంపియన్‌గా నిలిచిన బాలుర జట్టు

సుభాష్‌నగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ పోటీలో జిల్లా జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ఈనెల 19 నుంచి 21 వరకు టీజీఆర్ఎస్ తూప్రాన్ పాఠశాల క్రీడామైదానంలో జరిగిన 11వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ పోటీలో ఫైనల్ పోటీలో మెదక్ జిల్లా జట్టుపై తలపడి 6-1 పరుగుల తేడాతో విజయం సాధించి జిల్లా జట్టు బంగారు పతకం సాధించింది. బంగారు పతకం సాధించడం పట్ల సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, గంగా మోహన్‌లు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉత్తమ పిక్చర్‌గా చందు ప్రత్యేక బహుమతిని అందుకున్నారు. జిల్లా జట్టుకు కోచ్ మేనేజర్లుగా నరేష్, వినయ్, తిరుపతిలు వ్యవహరించారు.

వర్సిటీలో తెలుగు అధ్యాపకుల వార్షిక సదస్సు


టీయూ సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు

డిచ్‌పల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో బుధవారం తెలుగుశాఖ అధ్యాపకుల వార్షిక సదస్సు సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో విభాగాధిపతి లక్ష్మణ చక్రవర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మాతృభాషా తెలుగుగా ఉన్న తెలంగాణలో తెలుగు భాషకు అన్ని భాషల స్థాయిలో తప్పకుండా ప్రాధాన్యత ఇవ్వాలని సమావేశంలో కళాశాలల అధ్యాపకులు అభిప్రాయ పడ్డారు. డిగ్రీ కళాశాలల్లో ఇప్పటి వరకు ద్వితీయ భాషగా తెలుగు మూడు సంవత్సరాలుగా కొనసాగుతుందని వచ్చే విద్యా సంవత్సరం నుంచి రెండు సంవత్సరాలకు తగ్గించి 12 క్రెడిట్స్ పరిమితం చేయాలని ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఇటీవల జరిగిన ఆన్‌లైన్ సమావేశంలో నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఖండించారు. డిగ్రీ స్థాయిలో తెలుగు సబ్జెక్టును కోర్ సబ్జెక్టుగా కొనసాగించాలని వారు పేర్కొన్నారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన చైర్మన్


పరిసరాలను పరిశీలిస్తున్న గ్రంథాలయాల సంస్థ చైర్మన్

బోధన్‌రూరల్, మే21 (ఆంధ్రజ్యోతి): బోధన్ గ్రంథాలయాన్ని గ్రంథాలయాల సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో పాఠకులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. గ్రంథాలయంలో పాఠకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు అని పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. నిరుద్యోగ యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు తలారి నవీన్, గ్రంథపాలకులున్నారు.

నిర్మించిన మూడేళ్లకే గోడలకు పగుళ్లు


● అస్తవ్యస్తంగా మారిన నూతన కలెక్టరేట్ నిర్వహణ ● గోడలకు పెచ్చులు ఊడి, ఊడిన సీలింగ్

ఆంధ్రజ్యోతి పరిశీలన


కలెక్టరేట్‌లో ఎండిపోయిన మొక్కలు



నూతన కలెక్టరేట్ 1వ అంతస్తు, 2వ అంతస్తులో ఊడిపోయిన సీలింగ్


బాత్‌రూమ్‌లో గోడలకు పగుళ్లు


పెచ్చులూడిన గోడలు

నిజామాబాద్ అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల సేవలు అన్నీ ఒకేచోట ఉండేలా గత ప్రభుత్వ హయాంలో 44 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన నూతన కలెక్టరేట్ ప్రాంగణం నిర్వహణ లోపం కారణంగా అప్పుడే గోడలకు పెచ్చులు ఊడి, సీలింగ్ ఊడిపోయి పాత భవనాన్ని తలపిస్తుంది. 2017లో నూతన సమీకృత కలెక్టరేట్‌కు శంకుస్థాపన చేయగా 2022 సెప్టెంబర్‌లో మాజీ సీఎం కేసీఆర్ నూతన భవనాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే చోట తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. ఇంకా మూడేళ్ల కాక ముందే నూతన కలెక్టరేట్ నిర్వహణ లోపంతో అస్తవ్యస్తంగా మారింది. గార్డెన్‌లో చెట్లు ఎండిపోయి కనిపిస్తున్నాయి. బాత్‌రూమ్‌లలో గోడలకు పగుళ్లు రాగ చిన్న చిన్న మరమ్మతులు చేశారు. 1వ అంతస్తు సివిల్ సప్లై కార్పొరేషన్ కార్యాలయం వద్ద, 2వ అంతస్తు వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద సీలింగ్ పూర్తిగా ఊడి పోయి పాత భవనాన్ని తలపిస్తుంది. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనం మూడేళ్లకే ఇలా పెచ్చులు ఊడి, సీలింగ్ ఊడిపోయి పగుళ్లు వచ్చి పాత భవనాన్ని తలపిస్తుండటంతో కార్యాలయ సిబ్బంది ముక్కున వేలేసుకుంటున్నారు. కలెక్టరేట్ నిర్వహణ బాధ్యత కాంట్రాక్టరే చూసుకోవాల్సి ఉండగా అధికారులు సైతం నిర్వహణను పట్టించుకోవడం లేదు. కేవలం క్లీనింగ్ మాత్ర మే ఏజెన్సీ ద్వారా నిర్వహిస్తున్నారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన భవనాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనానికి రిపేర్‌లు చేయిస్తే బాగుంటుంది.

బోధన్‌లో భారీ వర్షం

బోధన్‌రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): బోధన్ డివిజన్‌లో బుధవారం తెల్లవారుజాము నుండి వర్షం కురుస్తూనే ఉంది. ఈదురు గాలులతో కురుస్తున్న వర్షం కురుస్తుంది. రుద్రూరులో 52.2మిల్లి మీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. అలాగే ఎడపల్లిలో 39మిల్లి మీటర్లు, చందూర్‌లో 37.2మిల్లి మీటర్లు, మోస్రాలో 30మిల్లి మీటర్లు, వర్నిలో 29.2మిల్లి మీటర్లు, కోటగిరిలో 31.8మిల్లి మీటర్లు, బోధన్‌లో 21.8మిల్లి మీటర్లు, రెంజల్‌లో 13.6మిల్లి మీటర్ల వర్షాపాతం నమోదైంది. ఉదయం నుండి కురుస్తున్న వర్షాలకు రోడ్లన్ని జలపాతం అయ్యాయి. శర్బత్ కెనాల్ తదితర ప్రాంతాలలో డ్రైనేజీ నుంచి రోడ్లపైకి పొంగిపొర్లింది. వెంటనే మున్సిపల్ సిబ్బంది వర్షపు నీరు నిల్వ ఉండకుండా జేసీబీతో శర్బత్ కెనాల్ కాల్వను శుభ్రం చేయించారు.

కమ్మర్‌పల్లి లో తడిసి ముద్దైన వరి ధాన్యం


కమ్మర్‌పల్లిలో వరి కుప్పల చుట్టూ చేరిన వర్షపు నీరు

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం తెల్లవారుజాము నుంచి వర్షం కురుస్తునే ఉంది. సాయంత్రం సైతం వర్షం కురవడంతో కల్లాలవద్ద కుప్పలుగా పోసిన వరిధాన్యం, నువ్వులు, సజ్జలు తడిసి ముద్దైనట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు 5 నుండి 6 సెంటిమీర్ల వర్షం కురిసినట్లు అంజనాలు వేస్తున్నారు. ఉదయం కురిసిన వర్షనికి తడిసిన కుప్పలను ఆరబెట్టుకున్నప రైతులు సాయంత్రం అనుకోకుండా వర్షం రావడంతో కుప్పలవద్దకు పరుగులు తీశారు అయినా కుప్పలు చట్టు వర్షపునీరు నిలిచి కుప్పలు తడిసినట్లు రైతులు చెబుతున్నారు. గత నెలరోజులగా వరి బాగా ఎండి కల్లాలవద్ద కుప్పలుగా పోసిన వరి తడిసి పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆదిలాబాద్ నుంచి ఆలంపురం వరకు పెద్దమ్మ ఆలయాలు

● రాష్ట్రంలో 80 శాతం మత్స్య సహకార సొసైటీలలో ముదిరాజ్‌లే ● కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి ఏలోకి మార్చాలి
● శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్


పర్మల్లలో మాట్లాడుతున్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్

లింగంపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌లు ఆదిలాబాద్ నుంచి ఆలంపురం వరకు గ్రామ గ్రామాన పెద్దమ్మ ఆలయాల నిర్మాణం చేపట్టారని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ అన్నారు. ఆయన బుధవారం లింగంపేట మండలంలోని పర్మల్ల గ్రామంలో నిర్మించిన పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో పెద్దమ్మ ఆలయాల నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని ఆయన తెలియజేశారు. ముదిరాజ్‌లు పెద్ద మ్మ ఆలయ నిర్మాణంతో పాటు ముదిరాజ్‌ల సంస్కృతిని చాటేలా వారం రోజుల పాటు అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేయాలన్నారు. రాష్ట్రంలో 80 శాతం మత్స్య సహకార సొసైటీలలో ముదిరాజ్‌లే ఉన్నారని ఆయన తెలియజేశారు. కామారెడ్డి జిల్లాలో అనేక గ్రామాల్లో ముదిరాజ్‌ల సొసైటీలు ఏర్పాటు చేశామని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఎల్లారెడ్డి నియోజకవర్గంలో స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో 60మంది ముదిరాజ్‌లు గెలుపొందడం అభినందనీయమని, ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదుగుతున్నారనడానికి ఇది నిదర్శనమని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డిలో ఇచ్చిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌ను అమలు చేసి ముదిరాజ్‌లు బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని ఆయన అన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం ముదిరాజ్‌లకు అవకాశం ఇవ్వాలని ఆయా పార్టీల నాయకులను కోరారు. పెద్దమ్మ ఆలయ అభివృద్ధికి రూ. 10 లక్షల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్, మాజీ ఎమ్మెల్యే సు రేందర్, తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేష్, ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు విఠల్, లింగంపేట మండల అధ్య క్షుడు సాయికుమార్, పర్మల్ల గ్రామ ముదిరాజ్‌లు ఈర్ల శ్రీనివాస్, బద్ద లక్ష్మయ్య, చంద్రబాబు, సాయికుమార్, సంగమేశ్వర్‌లతో పాటు జిల్లాలోని వివిధ మండలాల నుంచి తరలివచ్చిన ముదిరాజ్‌లు ఉన్నారు.

కనీస సౌకర్యాలు లేని కళాశాల

● ఇదీ నిజాంసాగర్ కస్తూర్బా కళాశాల హాస్టల్ దుస్థితి
● చలనం లేని పాలకులు, అధికారులు


నిజాంసాగర్ కస్తూర్బా కళాశాల ఇదే ..

నిజాంసాగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ కస్తూర్బా జూనియర్ కళాశాల హాస్టల్‌లో కనీస సౌకర్యాలు కనుమరుగయ్యాయి. కోటి 40 లక్షల రూపాయల వ్యయంతో 2019లో కస్తూర్బా విద్యాలయ జూనియర్ కళాశాల హాస్టల్ నిర్మాణం రెండు అంతస్తులుగా నిర్మాణం చేశారు. కాని నిధులు సరిపడక పోవడంతో భవన నిర్మాణం చేపట్టి రంగులు వేశారు. విద్యార్థినులకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఆలోచన జిల్లా యంత్రాంగానికి ప్రజా ప్రతినిధులకు లేకపోవడం పట్ల సర్వత్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ కళాశాలకు కేవలం తలుపులు, ఫ్లోరింగ్ పనులు చేపట్టారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మాణం చేసిన ప్పటికీ మరుగుదొడ్లలో ఫ్లోరింగ్ పనులు చేపట్టలేకపోయారు. కళా శాల హాస్టల్ రెండు అంతస్తులు నిర్మాణం చేసినప్పటికీ గదులకు కిటికీలు బిగించకపోవడంతో రాత్రి వేళలో దోమలు ఉండడంతో విద్యార్థినులకు మలేరియా జ్వరాలు వ్యాపించిన సంఘటనలు ఉన్నప్పటికీ అధికారులు పట్టినట్టుగా వివరిస్తూ ఉన్నారు. కళాశాల హాస్టల్ భవనాలు నిర్మాణం చేసిన అసం పూర్తిగా మిగిలి పోయిన భవనంలోని అరకొర వసతుల మధ్యన విద్యాభ్యాసం కొన సాగుతూనే ఉంది. రాత్రి వేళలో విద్యార్థినులు పడుకోవాలంటే భయపడుతూ ఉన్నారు. పక్కనే ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయంలో తలదాచుకుంటున్నారు తప్ప ఆ విద్యా లయంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థినిలు అనేక పాటలు పడుతూనే ఉన్నారు. ఈ పాఠశాలకు ప్రభుత్వం సరిపడా నిధులు మంజూరు చేయకపోవడంతోని హాస్టల్ కళాశాల నిర్మాణం పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయని పనులు చేపట్టిన కాంట్రాక్టర్ వాపోయారు. కళాశాలలో దాదాపు 150 మంది విద్యార్థినిలు విద్యాభ్యాసం చేస్తూ ఉంటారు. అధికారులు, పాలకులు ఏ కళాశాలపై దృష్టి సారించకపోవడం వల్ల ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారింది. మరో పక్షం రోజుల్లో విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుండటంతో ఈ విద్యా సంవత్సరం అయినా కస్తూర్బా కళాశాల హాస్టల్లో మౌలిక సదుపాయాలు ఏర్పా టు అయిన అనేది ప్రశ్నార్థకమే. ఇప్పటికైనా జిల్లా ఉన్నత అధికారులు స్పందించి కళా శాలలో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులన్నిటిని పూర్తి చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆంధ్రజ్యోతి ఫోకస్


ధర్మారావుపేట నుంచి లింగంపల్లికి వెళ్లే రోడ్డు


అమర్లబండ నుంచి కాళోజీవాడకు వెళ్లే రోడ్డు

గ్రామాల మధ్య.. లింకురోడ్లు బాగుపడేదెన్నడో..!?

● లింకు రోడ్లు బాగలేక 10 కిలోమీటర్ల మేర అదనపు ప్రయాణం ● ప్రభుత్వం పట్టించుకుంటేనే రైతులకు, ప్రయాణికులకు మేలు

సదాశివనగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల మధ్య లింకురోడ్ల అభివృద్ధికి నోచుకోకపోవడంతో ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుమని గ్రామీణ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. నా యకు లు ఎన్నికల సమయంలో ఇది చేస్తాం, అది చేస్తాం అంటూ వాగ్దానా లు ఇవ్వడం తప్ప వాటి గురించి మర్చి పోవడంతో సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న పరస్థితి దాపురించింది. మండలంలోని భూంపల్లి నుంచి ఉత్త నూర్ వరకు ధర్మారావుపేట నుంచి లింగంపల్లి వరకు, అమర్ల బండనుంచి కాళోజీవాడి వరకు, పద్మాజీవాడి నుంచి తుక్కోజీ వాడి వరకు ఉన్న లింకురోడ్లు బాగుపడకపోవడంతో వర్షా రాలం ఆయా గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడ టమే కాకుండా అనేక సందర్భాల్లో రాకపోకలు నిలిచిపోతున్నా యని ప్రజలు వాపోతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత గ్రామాలకు మహర్దశ వస్తుం దనుకున్న ప్రజలకు, రైతులకు ఇలాంటి రోడ్లను చూ స్తే అభివృద్ధి ఎక్కడ జరుగుతుందోనన్న సందేహ ప్రతివ్యక్తిలో కలుగు తుంది.

ఇబ్బందులు ఇలా

భూంపల్లి ఉత్తునూర్ గ్రామాల మధ్య వాగు ప్రవహిస్తుం డ టంతో వర్షాకాలం ఆయాగ్రామాలకు వెళ్లాలన్న తుక్కోజీవాడి మీదుగా భూంపల్లి వెళ్లాల్సి వస్తుందని దింతో 8కిలోమీటర్ల దూరం పెరుగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధర్మారావుపేట నుంచి లింగం పల్లి వెళ్లాలన్న వర్షాకాలంలో మూడేగాం మీదుగా 10కిలోమీటర్ల దురాభారం పెరిగి రైతులతో పాటుగా ప్రయాణీకులు కూడా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పద్మాజీవాడి ఎక్స్‌రోడ్డు నుండి తుక్కో జీవాడి గ్రామానికి వెళ్లాలన్న దగ్గి మీదుగా వెళ్లాల్సి రావడంతో 9కిలోమీటర్ల దూరబారం పెరిగి ఆర్థికంగా కూడా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి రోడ్లను సత్వరమే బాగుచేస్తే ప్రజలతో పాటుగా రైతులకు అనేక మేలు జరుగుతుందని అంటున్నారు.

రైతుల ఇబ్బందులు ఇలా..

అన్నిగ్రామాలకు శివారు గ్రామాల్లో వ్యవసాయభూములు ఉండటంతో రైతులు నిత్యం పోలాలకు వెళాల్సిన పరిస్థితి ఉంటుంది. లింకురోడ్లు సక్రమంగా లేకపోవడంతో రైతులకు వర్షాకాలం ఎలా వెళ్లాలో తోచక కొన్నిసందర్భాలలో దే వునిమీద భారం వేయ్యడం తప్ప ఏవిచేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. భూంపల్లి వాగుపైన బ్రిడ్జి లేకపోవడంతో వాగు అవతలి వైపు వ్యవసాయ భూములున్న రైతులు ఎరువులు వేయడానికి వెళ్లాలంటే తుక్కోజీవాడి మీదుగా ఉత్తునూరు వెపు వెళ్లి వ్యవసాయ భూములకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ధర్మారావు పేట్ రైతులు లింగంపల్లి శివారులో కొన్నివ్యవసాయ భూములు కలిగిూ ఉండటంతో వర్షాకాలం వ్యవసాయ భూము లకు ఎరువులు తీసుకోని వెళ్లాలన్న రోడ్డు బాగలేకపోవడంతో ఎడ్లబండ్ల ఎరువు బస్తాలను వేసుకుని దేవుడి మీద బారం వేసి వాగు దాటుతూ వ్యవ సాయ భూములకు వెళ్లాడానికి రైతులు ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. మట్టి దారులు బాగాలేక తిరిగి రావడంతో ఇంధన చార్జీలు బారం కావడం దూరప్రయాణంతో అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని వాపోతున్నారు. ప్రభుత్వం చెప్పుడు మాటలు కంటే ఇలాంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని గ్రామీణ రోడ్లను, లింకు రోడ్లను బాగు చేస్తే అందరికి న్యాయం జరుగుతుందని ప్రజలు కోరుతున్నారు.

● లింకు రోడ్లతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయి

అలకొండ చిన్నఆంజనేయులు, ధర్మారావుపేట్



గ్రామాల్లో ఉన్న లింకు రోడ్లపై ప్రభుత్వం దృష్టి సారించి లింకు రోడ్లను బాగుచేస్తే రైతులకు అనేక మేలు జరుగుతుంది. లింకు రోడ్లు బాగు చేస్తే వ్యవసాయ భూములకు వెళ్లడానికి సులువుగా ఉండి వ్యవసాయ పనులు సకాలంలో చేసుకోవడానికి వీలుంటుంది. ఇరు గ్రామాల మధ్య సంబంధాలు లింకు రోడ్ల వల్ల పెరిగి వ్య వసాయ విశేషాలు ఒకరినొకరు తెలుసుకునే అవకాశం ఉంటుంది. అధికారులు, నాయకులు స్పందించి లింగు రోడ్లను బాగు చేయ్యడంతో పాటుగా అవసరం ఉన్నచోట బ్రిడ్జిలను నిర్మించాలి.



ఆలయ నిర్మాణానికి విరాళం ఇస్తున్న ముదిరాజ్‌లు

లింగంపేటలో నేటి నుంచి పెద్దమ్మ ఉత్సవాలు

లింగంపేట, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఈనెల 22 నుంచి రెండు రోజుల పాటు పెద్దమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు అశోక్ తెలిపారు. 22న ముత్యాల పోచమ్మకు, మత్తడి పోచమ్మకు బోనాలు, 23న శుక్రవారం పెద్దమ్మకు బోనాలు, పెద్దమ్మ కల్యాణం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మత్తడి పోచమ్మ ఆలయ పునర్‌నిర్మాణానికి ముదిరాజ్ సంఘం నుంచి రూ.1,21,116లు విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం క్యాషియర్ అనిల్‌కుమార్, వెంకటి, విజయ్, సాయిరాం, సత్యంలు ఉన్నారు.



బీర్కూర్‌లో కౌలు వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

ఆలయ భూముల కౌలు వేలం

బీర్కూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం జెండా బాలాజీ ఆలయ భూముల కౌలుకు సంబంధించి దేవాదాయ శాఖ అధికారులు బహిరంగ వేలం పాట నిర్వహించారు. నిజామాబాద్ జెండాగల్లిలో గల జెండా బాలాజీ దేవాలయానికి, బీర్కూర్ గ్రామ పరిధిలో 2-29 ఎకరాల సాగు భూమి ఉంది. అయితే దేవాదాయ శాఖ అధికారులు ఈ భూమికి సంబంధించి సంవత్సరం పాటు కౌలు వేలం పాటను నిర్వహించగా పలువురు రైతులు పాల్గొన్నారు. జూకంటి సాగర్ అనే రైతు 51 వేల పాట పాడి సాగు కోసం భూములను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో శ్రీరాం, రవీందర్ పర్యవేక్షణ అధికారి సుమన్, జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్, ఆంజనేయులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మద్నూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని మద్నూర్ ఎస్సై విజయకొండ ప్రజలకు సూచించారు. డోంగ్లీ మండల కేంద్రంలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుర్తు తెలియని నెంబర్ల నుంచి ఫోన్లు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, బ్యాంకు లావాదేవీలలో జాగ్రత్తలు పాటించాలని, ఎవరికీ ఓటీపీ నెంబర్లు షేర్ చేయరాదని సూచించారు. వాహనదారులు వాహనాలకు సంబంధించిన పత్రాలను తమ దగ్గర ఉంచుకోవాలని హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడపాలని అదేవిధంగా గ్రామాలలో కొత్తవారు కనిపిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం చేరవేయాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచబడతాయని సూచించారు. పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయనతో పాటు పోలీసులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో యువ రైతు దుర్మరణం



భూక్యా రాజు

రామారెడ్డి, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపేట్ గ్రామ పరిధిలోని గన్‌పూర్ తండాకు చెందిన భూక్యా రాజు (35) అనే యువ రైతు కరెంట్ షాక్‌తో మరణించినట్లు రామారెడ్డి ఎస్సై నవీన్ చంద్ర పేర్కొన్నారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగా నిత్యం రాజు, యేసయ్య పొలం వద్దకు చేరుకొని పనులు చేస్తుండగా బుధవారం ప్రమాదవశాత్తు వర్షం పడుతుండగా కరెంటు తీగ తగిలి మరణించినట్లు ఎస్సై తెలిపారు. మృతి చెందిన రాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన తరలించారు. మృతుడి భార్య భూక్యా లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నవీన్ చంద్ర వివరించారు.



బండ ప్రకాష్, బుర్ర జ్ఞానేశ్వర్‌లను కలిసిన ముదిరాజ్ సంఘ ప్రతినిధులు

ముదిరాజ్‌ల సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తాం

కామారెడ్డి టౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌ల సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ అన్నారు. బుధవారం లింగంపేట మండలంలో ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన వారిని ముదిరాజ్ సంఘ ప్రతినిధులు కలిసి పలు అంశాలపై చర్చించారు. జిల్లా కేంద్రంలో జిల్లా ముదిరాజ్ సంఘానికి కేటాయించిన రెండు ఎకరాల స్థలంకు ప్రహరీ నిర్మించాలని ముదిరాజ్ సంఘ ప్రతినిధులు కోరగా హద్దులు నిర్ణయించాలని ఆర్డీఓకు సూచించారు. ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీతో స్థలం విషయమై చర్చిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పున్న రాజేశ్వర్, జిల్లా అధ్యక్షుడు గజ్జెల భిక్షపతి, బల్ల సత్తయ్య, నిజ్జన రమేష్, విఠల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మురికి కాలువలు శుభ్రం చేస్తున్న సిబ్బంది

మురికి కాలువల్లో చెత్తను వేయొద్దు

భిక్కనూరు, మే 21(ఆంధ్రజ్యోతి): మురికి కాలువల్లో చెత్తా చెదారాన్ని వేసి దోమలకు ఆవాసాలుగా మార్చొద్దని మండలంలోని బస్వాపూర్ గ్రామ కార్యదర్శి దయాకర్ కోరారు. బుధవారం గ్రామంలో గ్రామ పంచాయతీ కార్మికులు మురికి కాలువలను శుభ్రం చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మురికి కాలువల్లో చాలా వరకు ప్లాస్టిక్ బాటిళ్లు, వస్తువులు, చెత్త చెదారాన్ని వేస్తున్నారని, దీంతో మురికి కాలువలు జామై నీరు బయటకు రావడంతో పాటుగా దోమలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెత్తా చెదారాన్ని తడి, పొడి చెత్తను వేరు చేసి కేవలం రోజు వచ్చే పంచాయతీ ట్రాక్టర్‌లోనే వేయాలని కోరారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి



కామారెడ్డిలో రక్తదానం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

కామారెడ్డి టౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళ్లు అర్పించి యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం జీజీహెచ్ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం, దేశ ప్రజల రక్షణ కోసం ఎన్నో రాజీవ్‌గాంధీ కుటుంబం ఎన్నో త్యాగాలు చేసిందని తెలిపారు. రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటు హక్కును కల్పించారని, దేశంలో ఐటీరంగాన్ని తెచ్చి దేశానికి సేవలను అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షుడు గుడుగుల శ్రీనివాస్, అతిక్, రాజిరెడ్డి, సీరాజ్, రఫీ, జావెద్ తదితరులు పాల్గొన్నారు. కాగా నిజాంసాగర్ చౌరస్తా వద్ద గల రాజీవ్‌గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైజ్ఞానిక రంగంలో భారతదేశం ఇంతముందు ఉందంటే దానికి కారణం కేవలం రాజీవ్‌గాంధి పరిపాలన దక్షత అని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గుడుగుల శ్రీనివాస్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సీరాజుద్దిన్, నాయకులు ఇమ్రాన్, కిరణ్, హతిక్, రవి తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న రాజీవ్‌గాంధి విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ మేరకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింబాద్రి, కుంట లింగారెడ్డి, సుదర్శన్, రాజయ్య, ఆంజనేయులు, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ టౌన్: దేశానికి రాజీవ్‌గాంధీ చేసిన సేవలు మరువలేనివని రాష్ట్ర ఆగ్రోస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. బుధవారం పట్టణంలో రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశం కోసం రాజీవ్‌గాంధీ కుటుంబం ఎన్నో త్యాగాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఎర్వల కృష్ణారెడ్డి, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఖాలేక్, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు మధుసూదన్, రవీందర్, అఫ్రోజ్, గోపాల్‌రెడ్డి, గంగాధర్, నార్ల సురేష్, సతీష్‌గౌడ్, హన్మాండ్లు తదితరులున్నారు. పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో గల రాజీవ్‌గాంధీ విగ్రహానికి ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యుడు ఏనుగు రవీందర్‌రెడ్డి నివాళులర్పించారు. ఆయనతో పాటు నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

దోమకొండ: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి మాట్లాడుతూ ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, స్వామి, గోపాల్‌రెడ్డి, నల్లపు శ్రీనివాస్, రామస్వామిగౌడ్, సీతారాం మధు, నర్సారెడ్డి, అబ్రబోయిన రాజేందర్, రాజేందర్, నరేష్, నేతుల సుధాకర్, రసూల్, షమ్మీ, నయీం, బాల్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరులో..



దోమకొండలో..



బాన్సువాడలో..

వేధింపులు భరించలేకే కొడుకును చంపిన తండ్రి



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ చైతన్యారెడ్డి

కామారెడ్డి టౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): మద్యం వ్యసనానికి బానిసైన కన్న కొడుకు పెడుతున్న వేధింపులు భరించలేక కన్న తండ్రే కొడుకును హత మార్చినట్లు ఏఎస్పీ చైతన్యారెడ్డి తెలిపారు. బుధవారం కామారెడ్డి డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 19న కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగాపూర్ గ్రామానికి చెందిన వడ్ల నిఖిల్(24) అనే వ్యక్తిని అతని తండ్రి భాస్కర్ హత్య చేసినట్లు తెలిపారు. ఇటీవల గల్ఫ్ నుంచి వచ్చిన నిఖిల్ నిత్యం డబ్బుల కోసం తల్లిదండ్రులను వేధించేవాడు. ఈ క్రమంలో తాగుడుకు, వ్యసనాలకు బానిసై నిత్యం తల్లిదండ్రులతో గొడవపడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో 19న రాత్రి మరోమారు గొడవ చేయడంతో భాస్కర్, నిఖిల్‌లు ఘర్షణకు దిగారు. దీంతో పక్కనే ఉన్న ఇనుపరాడుతో భాస్కర్ నిఖిల్‌ను తలపై కొట్టాడు. వెంటనే కుటుంబీకులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆమె తెలిపారు. మృతుడి తండ్రి భాస్కర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కామారెడ్డి రూరల్ సీఐ రామన్, దేవునిపల్లి ఎస్ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న రాజేందర్

తాడ్వాయి, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గైని రాజేందర్, ఎల్లారెడ్డి ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు గైని శివాజీలు అన్నారు. మండలంలోని కరడ్‌పల్లి, చందాపూర్, సంగోజువాడి, దేమికలాన్, తాడ్వాయి, ఎర్రాపహాడ్ గ్రామాల్లో ప్రభుత్వం నిరుపేదలకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేసి మాట్లాడారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే నియోజకవర్గానికి 3,500 ఇళ్లను చేయించాడని అన్నారు. వీటిని త్వరగా నిర్మించుకుంటే ఆయా గ్రామాలకు మిగతా ఇళ్లను కూడా మంజూ రు చేయిస్తామని అన్నారు. ఇందులో ఆయా గ్రామాల కార్యదర్శులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ స్తులు తదితరులు ఉన్నారు.

బీబీపేట: మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లకు కాంగ్రెస్ నాయకు లు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదోడి సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. అందులో భాగంగానే ఇందిరమ్మ ఇళ్లను అందించేందుకు పెద్ద ఎత్తున నిర్మాణ కార్యక్రమాలు చేపట్టడంతో పాటు లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా పెట్టుబడి ఇప్పించే ప్రయత్నాలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుతారి రమేష్, ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్, ఎంపీవో అబ్బాగౌడ్, గ్రామ కార్యదర్శి రమేష్, మాజీ ఎంపీటీసీ మల్లారెడ్డిపేట భూమాగౌడ్, సీనియర్ నాయకులు సలీం, మార్కెట్ కమిటి డైరెక్టర్ తోట రమేష్, నాయకులు నర్సింలు, యూత్ అధ్యక్షుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి రూరల్: ఎల్లారెడ్డి మండల పరిధిలోని కళ్యాణి, లక్ష్మాపూర్ గ్రామాల్లో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఎంపీవో ప్రకాష్, మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబాలు ముగ్గులు పోశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల సొంతింటి కల నెరవేరుతుందని అన్నారు. విడతల వారిగా అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమన్నారు. అనంతరం కళ్యాణి గ్రామంలో మొదటి ప్రాధాన్యత కలిగిన 10 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సుధారాణి, లక్ష్మాపూర్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజీవులు, శ్రీనివాసులు, లక్ష్మాగౌడ్, నరేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



బీబీపేటలో..

భిక్కనూరు విండో ఇన్‌చార్జి కార్యదర్శిగా రవికిరణ్



రవికిరణ్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

భిక్కనూరు, మే 21(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు విండో ఇన్‌చార్జి కార్యదర్శిగా రవికిరణ్‌ను నియమిస్తూ పాలకవర్గం సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. బుధవారం విండో చైర్మన్ భూమయ్య అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విండో చైర్మన్ మాట్లాడుతూ జిల్లా సహకార అధికారి ఉత్తర్వుల మేరకు విండో కార్యదర్శి నర్సింలును తొలగించి విండోలో పని చేస్తున్న రవికిరణ్‌ను ఇన్‌చార్జి కార్యదర్శిగా నియమిస్తూ పాలకవర్గం తీర్మానం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో విండో వైస్‌చైర్మన్ ముచ్చర్ల రాజిరెడ్డి, డైరెక్టర్లు మహిపాల్‌రెడ్డి, బచ్చుగారి నర్సింలు, ఉప్పరి సాయిలు, అంబళ్ల మల్లేషం, వెంకట్‌గౌడ్, నర్సింలు, జయమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి



బీర్కూర్‌లో శిక్షణ ఇస్తున్న ఎంఈవో వెంకన్న

బీర్కూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈవో వెంకన్న తెలిపారు. బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నాణ్యమైన విద్యా బోధనపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమం ఐదు రోజుల పాటు కొనసాగుతుందని ఎంఈవో వెంకన్న తెలిపారు. నాణ్యమైన విద్యా బోధనపై ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయులు మెరుగైన పనితీరు ప్రదర్శించాలనే ఉద్దేశంతో ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రాథమిక పాఠశాల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని అన్నారు. వివిధ సబ్జెక్టులపై రీసోర్స్ పర్సన్‌లు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంపై రీసోర్స్ పర్సన్లు నాగరాజు, శ్రీధర్ భార్గవ్, మహేష్, శంకర్, సాయికుమార్, వినోద్, సత్యనారాయణ, గంగాధర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తెగిపడి ఆవు మృతి



మృతి చెందిన ఆవు

మద్నూర్, మే 21 (ఆంధ్రజ్యోతి) : మద్నూర్ మండలం కొడిచిర గ్రామ శివారులో బుధవారం ఉదయం ఈదురు గాలులకు కరెంట్ తీగలు తెగిపడటంతో ఆవు మృతి చెందినట్లు రైతు భేతే సంజు తెలిపారు. ఆవు విలువ సుమారు రూ.35వేలు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలని రైతు బేతే సంజు ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మద్నూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): మద్నూర్ పోలీసులకు అందిన సమాచారం మేరకు మండలంలోని కొడిచీర గ్రామంలో పేకాట ఆడుతున్న వారిపై దాడి నిర్వహించి పేకాట ఆడుతున్న నలుగురిని పట్టుకుని, వారి వద్ద నుంచి రూ.1670, మూడు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు మద్నూర్ ఎస్సై విజయకొండ తెలిపారు.

ఆటో, కారు ఢీ : పలువురికి గాయాలు

నసురుల్లాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్‌ఎంకే డిగ్రీ కళాశాల వద్ద బుధవారం మూల మలుపు వద్ద కారు, ఆటో ఢీకొనడంతో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎదురెదురుగా వస్తున్న ఆటో, కార్ ఢీకొనడంతో పలువురికి గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. బాధితులను చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రెండు లారీల ఢీ : డ్రైవర్‌కు గాయాలు

కామారెడ్డి టౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టెక్రియాల్ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారు జామున రెండు లారీలు ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న రాజస్థాన్ లారీని వెనుక నుంచి వస్తున్న మహారాష్ట్ర కంటైనర్ లారీ ఢీకొట్టింది. కంటైనర్ లారీ డ్రైవర్ అజాగ్రత్తగా వాహనాన్ని నడపడంతో లారీ ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో పాటు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు, పోలీసులు డ్రైవర్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజు తెలిపారు.

భార్యను హత్యచేయాలని ప్రయత్నించిన నిందితుడికి ఐదేళ్ల జైలు

కామారెడ్డి టౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): భార్యను కత్తితో పొడిచి హత్య చేయాలని ప్రయత్నించిన నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా న్యాయమూర్తి విధించినట్లు ఎస్పీ రాజేష్‌చంద్ర తెలిపారు. గాంధారి మండలం మర్లకుంట తండాకు చెందిన బాదవత్ తేజానాయక్ తన కూతురు బాద వత్ స్వాతిని మాచారెడ్డి మండల కేంద్రానికి చెందిన విస్లావత్ లచ్చిరాంకు ఇచ్చి వివాహం జరిపాడు. తాగుడుకు బానిసైన లచ్చిరాం స్వాతిని కట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టినా లచ్చిరాం పద్ధతి మార్చుకోకపోవడంతో స్వాతి తన తండ్రి వద్దే ఉంటుంది. ఈ క్రమంలో 2022 ఫిబ్రవరి 26 న గాంధారికి టైలరింగ్ నిమిత్తం వెళ్లిన స్వాతిని లచ్చిరాం హత్య చేసేందుకు కత్తితో దాడి చేశాడు. దీంతో ఆమె ముఖం, ఎడమ చేతికి గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. స్వాతి తండ్రి తేజానాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి కోర్టులు సాక్ష్యా ధారాలు సమర్పించడంతో న్యాయమూర్తి అతనికి జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు.

యువకుడి అదృశ్యం



నామాల శ్రీనివాస్

రామారెడ్డి, మే 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఓ యువకుడు అదృశ్యమైనట్లు రామారెడ్డి ఎస్సై నవీన్‌చంద్ర పేర్కొన్నారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నామాల శ్రీనివాస్ అనే యువకుడు ఈనెల 14న ఖమ్మం జిల్లా కేంద్రానికి మత్స్యకారుల సమావేశానికి వెళ్లాడు. 20వ తేదీన నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వెళుతున్నట్లు తెలిపారు. బుధవారం మిస్సింగ్ అయినట్లు భార్య సౌందర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నవీన్ చంద్ర వివరించారు.

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

